
# తాతగారి పాలెం




సుమారు నలభై సంవత్సరాల తరువాత ఆ పల్లెటూరు వెడుతున్నాడు డా॥ ఆనంద్. ఆ ఏ.సి. కోచ్‌లో రెండో బెర్త్ ఖాళీగా ఉంది. అటెండెంట్ వచ్చి చెప్పాడు 'మీరు తలుపులు వేసుకుని పడుకోండి. మిమ్మల్ని మీ స్టేషన్ వచ్చే ముందు లేపుతాను'... 'గుడ్‌నైట్'.

తలుపులు వేసుకుని కిటికీ దగ్గర కూర్చున్నాడు – ఆ చీకటిలోకి చూస్తూ. తను ఆ పల్లెటూరిలో తన చిన్నతనంలో గడిపిన శెలవు రోజులు జ్ఞాపకం రావడం మొదలు పెట్టాయి. తన చిన్నతనంలో ఇంకా కలర్ సినిమాలు రాలేదు – అయినా తన స్మృతులన్నీ రంగుల లోనే కనిపించాయి. ఎందుకో ఈసారి ఇండియా వచ్చినప్పటి నుంచీ ఆ పల్లెటూరు వెళ్లాలని అన్పించింది.

తన తాత, బామ్మలకు ఒక్కరే సంతానం – తన తల్లిదండ్రులకు తానొక్కడే సంతానం. తాతగారు అడ్వకేట్. ఆ రోజుల్లో ఆయనది మంచి సంపాదన. అయినా ఆ పల్లెటూరులో స్థిరపడ్డారు. ఆయనకు ఆ రోజుల్లో వున్న డబ్బుతో ఏ పట్టణంలో అయినా స్థిరపడొచ్చు. అయినా ఆయనకు ఎందుకో ఆ పల్లెటూరులో స్థిరపడాలనిపించింది. తన తండ్రి ఏదో కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పనిచేసేవాడు. సెలవుల్లో కొద్దిరోజులు తనూ అమ్మానాన్నలతో పాటు తాతగారి దగ్గరకు వెళ్లేవాడు. తాత, బామ్మ తనను ఎంతో ముద్దు చేసేవారు. ఒక్కడే సంతానం కావడం వల్ల తల్లి, తండ్రి కూడా చాలా ముద్దుచేసేవారు.

తాతగారికి ఒక తమ్ముడు ఉండేవాడు. ఆయనకు చాలామంది మనుమలుండేవారు. వాళ్లూ సెలవులకు వస్తూండేవారు. వాళ్ల ఇంటి వెనకాల సాలీలు ఉండేవారు. వాళ్ల పిల్లలు – ఇంచుమించు తన వయస్సువాళ్లే. వాళ్లందరూ కలిసి గాలిపడగలు, రుంజలు (అదోరకమైన గాలిపటం) – చేలగట్టులమీద పరుగులు, భయమంటే ఎరుగని రోజులు. పాములు కనిపించేవి, అయినా భయపడేవారు కాదు. చేల గట్ల మీద పడి అప్పుడప్పుడూ చిన్నచిన్న దెబ్బలు తగిలేవి. బామ్మ ఏవో మందులు వేసేది. త్రాగినన్ని కొబ్బరిబొండాలు, తిన్నన్ని తాటిముంజలు... మధ్యమధ్యలో మామిడికాయలు– ప్రకృతి సౌందర్యం అంటే అప్పుడు తెలియకపోవచ్చు కానీ – ఇప్పుడనిపిస్తోంది... తను అటువంటి శెలవులు – ఇంకెన్నో సంవత్సరాలు గడపలేక పోయాను అని. అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారిపోయాడు.

'సార్ మీ స్టేషన్ ఇంకొక పది నిమిషాల్లో వస్తుంది' అటెండెంట్ మాటలకు నిద్రలేచాడు



డా॥ ఆనంద్. స్టేషన్ రావడం – ట్రైన్ ఆగడం – డా॥ ఆనంద్ దిగడం చకచకా జరిగిపోయాయి.

స్టేషన్ ఎంత మారిపోయింది! కిరసనాయిలు దీపాల స్థానంలో ట్యూబ్‌లైట్స్ మెరిసిపోతున్నాయి. ప్లాట్‌ఫారం మట్టితో నిండి

ఆనందకృష్ణ

వుండేది. ఇప్పుడు ప్లాట్‌ఫారమ్‌పైన షెడ్ - నీళ్లటాప్‌లు - వెయిటింగ్ రూమ్‌లు... తన చిన్నప్పుడు తల్లి, తండ్రి వచ్చినప్పుడు తాతయ్య వాళ్లకోసం ప్రత్యేకంగా ఒంటెద్దు బండి పంపించేవారు. స్టేషన్ బయటకు వచ్చాడు. ఒంటెద్దు బళ్లు లేవు. ఒకటే ఆటో రిక్షా...

డా॥ ఆనంద్‌ని చూడగానే ఆటో డ్రైవర్ అడిగాడు 'ఎక్కడికి వెళ్లాలి సార్?'

'గాజులపాలెం'

చిన్నగా నవ్వాడు ఆటో డ్రైవర్... 'మీరు ఈ ఊరు వచ్చి ఎన్ని సంవత్సరాలు అయ్యిందండి?'

'నలభై యాభై సంవత్సరాలు - ఇంచుమించుగా'

అందుకే మీరు గాజులపాలెం అంటున్నారు - ఇప్పటి పేరు 'తాతగారి పాలెం'.

'నా చిన్నప్పుడు ఒక ఒంటెద్దు బండి వచ్చేది మా కోసం - అతని పేరు వెంకన్న'.

'ఆయన మా నాన్నండి... నా పేరు రమణ. కూర్చోండి' అంటూ సీటుని తువ్వాలుతో తుడిచాడు రమణ.

ఇంతలో స్టెతస్కోప్ పట్టుకుని ఒకాయన వచ్చాడు. ఆయన వెంట మెడికల్ బాగ్ పుచ్చుకుని మరొకతను వచ్చాడు. చూడగానే తెలుసుకోవచ్చు ఆయన ఒక డాక్టరు, రెండవ వ్యక్తి ఆయనకు అసిస్టెంట్ అని.

'అమ్మగారు ఇవేళ రాలేదా డాక్టర్‌గారూ?'

'అమ్మగారికి ఆపరేషన్ ఉంది... ఆమెకు సహాయం చేయడానికి త్వరగా తిరిగి వెళ్దామని పొద్దున్నే బయలుదేరాను. దానికి తోడు కారుకి ఏదో ప్రాబ్లమ్. స్టేషన్‌కి వస్తే ఒకటే ఆటో - అదీ ఆక్యుపైడ్'...

'మీరు ఎక్కడికి వెళ్లాలి?' అడిగాడు ఆనంద్.

'తాతగారిపాలెం'.

'నేనూ అక్కడికే వెడుతున్నాను. మీరు నాతో రావచ్చు... అభ్యంతరం లేకపోతే...'

'థ్యాంక్యూ...' చెయ్యి అందించాడు ఆయన డా॥ ఆనంద్‌కి. 'ఐ యామ్ డాక్టర్ శేఖర్' అంటూ తనను పరిచయం చేసుకున్నాడు.

'ప్లీజ్‌డ్ టు మీట్ యు - ఐ యామ్ డాక్టర్ ఆనంద్'.

'డాక్టర్‌గారూ - మీరు ఇంత పొద్దున్నే వెళుతున్నారు పేషంట్స్ వస్తారా?' అడిగాడు రమణ.

'నిన్న కబురుపెట్టాను. ఇవేళ పొద్దున వచ్చి పన్నెండు గంటలకల్లా తిరిగి వెళతానని' జవాబు చెప్పాడు డా॥ శేఖర్.

ఆటో మెల్లగా వెడుతోంది... రోడ్డు తనకు జ్ఞాపకం ఉన్న మట్టిరోడ్డు కంటే చాలా బావుంది. తారురోడ్డు... గతుకులు లేవు.

'డాక్టర్ ఆనంద్ - మీరు ఇంత పల్లెటూరు రావడం? ఎవరైనా బంధువులున్నారా?'

'లేదండీ! నా చిన్నప్పుడు మా తాతగారు, బామ్మా ఇక్కడ వుండేవారు. సెలవులలో వస్తూండేవాడిని' శేఖర్ ప్రశ్నకు ఆనంద్ జవాబు.

ఆనంద్ తాతగారి పేరు వినగానే అతని మొహంలోకి చూసాడు డా॥ శేఖర్ 'మీరు ఆయన మనుమడా!' అన్నట్టుగా... కానీ ఏం మాట్లాడలేదు.

'మీరు ఎక్కడ ఉంటారు?' శేఖర్ ప్రశ్నకు తన జేబులోంచి విజిటింగ్ కార్డ్ తీసి ఇచ్చాడు

ఆనంద్. 'సుమారు గత నలభై ఏభై సంవత్సరాలుగా దేశానికి దూరంగా వుంటున్నాను. అప్పుడప్పుడూ వచ్చి, వారం పదిరోజులు ఇండియాలో గడిపి వెళ్తూంటాను'.

కార్డు చూస్తూనే ఆనంద్ మొహంవైపు తీక్షణంగా చూసాడు. మొహం ఎక్కడో చూసినట్టుంది. ఆలోచించసాగాడు. ఎక్కడ అయ్యుంటుంది? తన కళ్లను తనే నమ్మలేక పోయాడు. ఎదురుగా ఉన్నది ప్రపంచ ప్రఖ్యాతిపొందిన హృద్రోగ శస్త్రచికిత్స నిపుణుడు. వైద్యరంగంలో – హృద్రోగ శస్త్రచికిత్స రంగంలో ఆయన పేరు విననివారు ఉండకపోవచ్చు... టోక్యోలో జరిగిన ఒక ప్రపంచ వైద్యనిపుణుల సదస్సులో చూసాడు. తన మతిమరుపుకు తనను తనే నిందించుకున్నాడు. అంతటి డాక్టర్‌ని ఆనవాలు పట్టనందుకు.

'క్షమించాలి – మిమ్మల్ని ఒక్కసారే చూసాను టోక్యోలో. ఇట్ ఈజ్ ఎ డ్రీమ్ కమ్ ట్రూ – టు మీట్ యూ'.

శేఖర్ తన కార్డు తీసి ఇచ్చాడు. డా॥ ఆర్. చంద్రశేఖర్, ఎం.డి., డి.ఎం., కార్డియాలజిస్ట్ – సర్జన్. ఆయనకు లేని అర్హత లేదు. ఆశ్చర్యంగా చూసాడు డా॥ ఆనంద్. ఆ పేరు ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం వచ్చింది. ఒక్క క్షణం ఆలోచించాడు.

'మీరు తరచుగా మెడికల్ జర్నల్స్‌కి ఆర్టికల్స్ వ్రాస్తారు కదూ?'

'అప్పుడప్పుడూ వ్రాస్తూ వుంటానండీ' శేఖర్ నిదానంగా చెప్పాడు.

'అలా అనకండి. మీ ఆర్టికల్స్‌ని చాలా ఎప్రిషియేట్ చేస్తారు'.

'మీ భార్య కూడా డాక్టర్ అన్నారు – ఆమె స్పెషాలిటీ?'

'ఎమ్.ఎస్., ఛైల్డ్ స్పెషలిస్ట్'.

'డా॥ శేఖర్... ఒక చిన్న అనుమానం. మీరు, మీ భార్య ఇద్దరూ గొప్ప అర్హతలున్నవారు... ఇంత చిన్న పట్టణంలో స్థిరపడి మీ చదువుకి, ఉన్నత విద్యకూ న్యాయం చేస్తున్నారా? మీరు ఏ అమెరికాకో వెళ్లివుంటే... కనీసం ఏ పెద్ద సిటీలోనైనా ప్రాక్టీస్ పెట్టివుంటే... మీరు చదివిన చదువుకు ప్రతిఫలం...'

చిన్నగా నవ్వాడు డా॥ శేఖర్. 'ఏముందండీ... చేతినిండా పని. కానీ పేద ప్రజలకు మారుమూల గ్రామాల్లో, ఏ డాక్టరూ వెళ్లని కుగ్రామంలో చేయగలిగిన సహాయం చేస్తున్నామన్న ఆనందం. పెద్దపెద్ద పట్టణాల్లో చాలామంది డాక్టర్లున్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్, లేని రోగాలను ఊహించుకుని పెద్దపెద్ద డాక్టర్ల చేత వైద్యం చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్న కోటీశ్వరులు, లేని రోగాలకు వైద్యం చేయడానికి సిద్ధంగా ఉన్న పేరుమోసిన డాక్టర్లు... బహుశా ఆ వాతావరణం మాకు సరిపడదేమో? ఇక్కడ అమాయకపు ప్రజలు – మందులు కొనుక్కోవడానికి కూడా డబ్బులు లేని పేదప్రజలు... వాళ్లు ఇవ్వగలిగిందల్లా వాళ్ల అమాయకత్వంతో నిండిన ధన్యవాదాలు... అవి చాలండీ మేం పడ్డ శ్రమకు ప్రతిఫలంగా. నా భార్య కూడా నాలాగే పేద ప్రజలకు సేవ చేయాలనే కోరిక కలిగి వుండడం నిజంగా నా అదృష్టం. పిల్లలు ఇద్దరూ మెడిసిన్ చదువుతున్నారు. ఈ తరం పిల్లలు... వాళ్లెక్కడ వుంటారో చెప్పడం కష్టం'.

'ఇంచుమించు సర్జరీలు మర్చిపోయి వుంటారు...'

'లేదు... చిన్న చిన్న సర్జరీలు చెయ్యడానికి

సరిపడే ఆపరేషన్ థియేటర్ వుంది మా హాస్పటల్‌లో. నా భార్య సిజేరియన్ సెక్షన్స్ కూడా చేస్తుంది. చిన్న మెటర్నిటీ వార్డ్ ఉంది. మా ఇద్దరికీ చేతినిండా పని. మా వూరికి కొద్దిమైళ్ల దూరంలో ఉన్న పెద్ద పట్టణంలో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఉంది. అక్కడ మేం ఇద్దరం కన్సల్టింగ్ సర్జన్స్. వారానికి కనీసం రెండు సార్లు సర్జరీలకు అక్కడకు వెళతాం. ఆంజియోగ్రామ్, ఆంజియోప్లాస్ట్ చాలా మామూలు... బైపాస్ కూడా చేస్తాం. ఆ హాస్పటల్‌లో అన్ని ఆధునిక పరికరాలూ వున్నాయి. మంచి డాక్టరు, సర్జన్లు ఉన్నారు. పేదప్రజలకు ఉచితంగా సర్జరీ చేస్తాం'.

'మీరు ఈ చిన్న ఊరికి అంకితం అయిపోయారనుకుంటాను' నవ్వుతూ అన్న ఆనంద్ మాటలకు -

'అబ్సెస్సడ్' అనండి నవ్వేసాడు డా॥ శేఖర్.

ఆటో మెల్లిగా వెడుతోంది. 'గాజులపాలెం' - అదే 'తాతగారి పాలెం' పొలిమేరల్లోకి వచ్చారు. ఎదురుగా పంటకాలువ. ప్రక్కనే ఒక కొబ్బరితోట... 'ఒకసారి ఆటో ఆపు' ఆనంద్ మాటలకు ఆటో ఆపాడు రమణ. కిందకు దిగి ఆ కొబ్బరితోటలోకి వెళ్లాడు ఆనంద్. ఆయనతో డా॥ శేఖర్, రమణా వెళ్లారు.

'ఇక్కడ మామిడితోట వుండేది కదూ?'

'అవునండీ... నా చిన్నప్పుడే చెట్లు చచ్చిపోయాయండి. ఇప్పుడు కొబ్బరితోట - ఇది తాతగారితోటేనండి'.

మళ్లీ ఆటో బయలుదేరింది. ఊరి పొలిమేరల్లో గ్రామదేవతల గుడి వుంది. రమణ ఆపడం - మళ్లీ ఆనంద్, శేఖర్ దిగడం, గుడిలోకి వెళ్లడం జరిగిపోయాయి. గుడికి ప్రహారీ గోడలున్నాయి. శుభ్రంగా వెల్లవేసి వున్నాయి. రెండు గుళ్లు - ఒకటి మహాలక్ష్మి అమ్మవారు, రెండోది గ్రామదేవత మావుళ్లమ్మ. బయటి నుంచే నమస్కారం చేసాడు ఆనంద్. ప్రక్కనే చిన్న చెరువు. ఆ గ్రామదేవతలకు సంవత్సరానికి ఒకసారి ఉత్సవం చేస్తారు. జంతుబలి ఇచ్చేవారు.

'ఇంకా దున్నపోతు బలి ఇస్తున్నారా" అడిగాడు ఆనంద్.

'లేదండీ. ఇప్పుడు అమ్మవారికి సాత్విక ఆహారం. పళ్లు, పరమాన్నం...'. అవేనండి ప్రసాదం'.

మెల్లగా ఊళ్లోకి వచ్చింది ఆటో. ఊరి మధ్యలో అమ్మవారికి ఎత్తైన తాటిచెట్లతో ఊయలవేసి ఊపేవారు. ఇప్పుడు అదే స్థలంలో సిమెంట్ స్తంభాల ఉయ్యాల వేసివుంది. ఇంకొంచెం ముందుకు వెళ్లింది ఆటో. రెండు చెరువులు. ఒకటి మంచినీటికి, మరొకటి పశువులకు. మంచినీటి చెరువు ప్రక్కన ఒక చిన్న కట్టడం.

'అది త్రాగేనీళ్లు శుభ్రం చేయడానికి వాటర్ వర్క్స్' చెప్పాడు రమణ.

'ఇక్కడ బందీల దొడ్డి వుండేది కదూ?'


'ఇప్పుడు లేదండి'.

ఆ చెరువులు దాటగానే ఆటో కుడిప్రక్కకు తిప్పబోయాడు రమణ.

'ఇక్కడ ఆపు. పది అడుగులు... మేం నడిచి వెళతాం...' ఆటో దిగబోయాడు డా॥ శేఖర్.

'ఫరవాలేదండి. మీకు అభ్యంతరం లేకపోతే మీ హాస్పటల్ నేనూ చూస్తాను'.

'యు ఆర్ వెల్‌కం... రండి'.




డా॥ ఆనంద్‌ని తమతో తీసుకువెళ్లాడు డా॥ శేఖర్. ఒక చిన్న ఇంటిముందర ఆగింది ఆటో. శుభ్రంగా ఉన్నాయి వాతావరణం, పరిసరాలు. మూడు గదులు ఉన్నాయి. ఒకటి పరీక్ష గది, ఒకటి మందులగది, మరొకటి పేషెంట్స్ కూర్చునే గది, చిన్న బాత్‌రూం. ఆసుపత్రి పేరు 'తాతగారి ఆసుపత్రి'. అప్పటికే పది పదిహేను మంది డాక్టరుగారి రాకకోసం ఎదురుచూస్తున్నారు. డా॥ శేఖర్‌ని చూడగానే అందరూ లేచి నిలబడ్డారు. డా॥ శేఖర్ తన గదిలో కూర్చున్నాడు. ప్రక్కన ఒక కుర్చీలో కూర్చున్నాడు డా॥ ఆనంద్.

అంతే... డా॥ శేఖర్ తన ప్రక్కన ఆనంద్ ఉన్నాడన్న మాటే మర్చిపోయాడు. ఒకరి తరువాత మరొక పేషెంట్ – కొంతమందికి కాంపౌండర్ మందులిస్తున్నాడు. మరికొందరికి తన బాగ్‌లో నుంచి మందులు తీసి ఇస్తున్నాడు శేఖర్. ప్రక్కనే ఒక చెక్కపెట్టె వుంది. కొంత మంది దాంట్లో రూపాయి కాసులు వేస్తున్నారు. కొంతమంది నోట్లు వేస్తున్నారు. కొంతమంది ఏమీ వెయ్యకుండానే నమస్కారం పెట్టి వెళ్లి పోతున్నారు. ఎవరి స్తోమతను బట్టి వాళ్లు ప్రవర్తిస్తున్నారు. వాళ్లు ఏమి వేస్తున్నారో కూడా శేఖర్ చూడడంలేదు. ఒక గంటసేపు చూసాడు.

'మీరు ఎంతసేపు వుంటారు?' ఆనంద్ ప్రశ్నకు 'పేషెంట్స్ వున్నంతవరకూ' శేఖర్ జవాబు.

'నాకు ఒక అరగంట టైమ్ ఇవ్వండి. ఇంటికి వెళ్లి కొంచెం బట్టలు మార్చుకుని వస్తాను. మీతో మాట్లాడాలి'.

'ఇట్ విల్ బి మై ప్లెజర్'

ఆటో తాతగారి ఇంటివైపు తిప్పించాడు.

'ఎవరింటికి వెళ్లాలండి'?

'కాలువ పక్క రోడ్డుమీద ఆఖరి ఇల్లు – తన తాతగారి పేరు చెప్పాడు. 'తాతగారి ఇంటికా? చెప్పారుకాదు...!'

ఇంటిముందర ఆటో ఆగగానే 'ఎవరు

కావాలండీ?' అంటూ బయటకు వచ్చాడు రామయ్య.

'నేను... మనవణ్ణి... ఇంచుమించు నలభై, ఏభై సంవత్సరాలు అయింది... నేను ఈ ఊరు ఆఖరిసారి వచ్చి... మీరు ఎవరూ నన్ను ఆన వాలు కట్టలేరు. బహుశా అప్పటికి మీరు ఇంకా పుట్టివుండరు'.

'మా తాతగారి మనుమడా మీరు? ముంద ర చెబితే స్టేషన్‌కి వచ్చేవాడిని కదండీ' రామ య్య మొహంలో ఆప్యాయత, ఆనందం. ఆ కళ్లలో ఏదో కృతజ్ఞత కూడా కన్పించింది డాక్టర్ ఆనంద్‌కి.

'ఒక్కరే వచ్చారా? అమ్మగారిని తీసుకు రావలసింది'.

'అమ్మగారు – పిల్లలూ పట్టణంలోనే వుండి పోయారు. ఈ పల్లెటూర్లు, ప్రయాణాలూ వాళ్ల కు పడతాయో లేదో అని నేనే తీసుకురాలేదు. వారం రోజులలో తిరిగి అమెరికా వెళ్లిపోతాం'.

ఆనంద్ చేతిలో నుంచి బేగ్ తీసుకుని ఇంట్లోకి నడిచాడు రామయ్య. ఇల్లంతా శుభ్రం గా ఉంది... అద్దంలా ఉంది. ఎదురుగా తాత గారిది, బామ్మది బొమ్మలున్నాయి. ఒక గది తాళంవేసి వుంది. ఆ గది తాళం తీసాడు రామయ్య. శుభ్రమైన మంచం, పరుపు – లైట్లు, ఫ్యాన్, చిన్న టేబుల్, కుర్చీ – బాత్‌రూం – ఎవరో ఉంటున్నంత శుభ్రంగా ఉంది ఆ గది.

'తాతగారి గది అండి. అలాగే పెట్టాం. మీరు ఇక్కడే పడుకోండి. ప్రతి రోజూ గది శుభ్రం చేస్తామండి'. గది కళకళలాడుతోంది.

'బామ్మగారు, తాతగారూ ఒకరి తరువాత ఒకరు కొద్దికాలం తేడాలోనే కళ్లుమూసారు. నాన్నగారు, అమ్మగారూ తరువాత ఒకటి రెండుసార్లు వచ్చారు. తరువాత మీరందరూ అమెరికాలోనే స్థిరపడిపోయారని తెలిసింది. తరువాత మళ్లీ ఇదే తాతగారి కుటుంబంవారు ఈ ఊరు రావడం – ఇక్కడ వాళ్లకు తెలిస్తే ఎంతో సంతోషిస్తారండి...' ఇంకా ఏదో చెప్ప బోయాడు రామయ్య.

'నేను ఎవరో ప్రస్తుతం ఎవరికీ చెప్పొద్దు. సమయం వచ్చినపుడు నేనే చెబుతాను' అన్నా డు ఆనంద్.

'అయ్యగారూ, స్నానం చెయ్యండి – బాత్ రూమ్‌లో నీళ్లువస్తాయి'.

'లేదు... నేను నూతి దగ్గర స్నానం చేస్తాను' చిన్నతనంలో తను నూతిలోంచి చిన్న బాల్చీతో నీళ్లుతోడి పోసుకునేవాడు. పక్కన జాగ్రత్తకోసం పాలేరు. ఆ నీళ్లను అరటిచెట్లవైపు, నిమ్మచెట్ల వైపు మళ్లిస్తూ వుండేవాడు పాలేరు.

'అలాగేనండీ...' అని 'తాతగారి మను మడు వచ్చారు. నూతి దగ్గర స్నానం చేస్తారట. అక్కడ కొంచెం శుభ్రంచెయ్యి' పురమాయిం చాడు భార్యకు రామయ్య.

'నమస్కారం అయ్యగారూ – అమ్మగారు రాలేదా' సాదరంగా నమస్కారం చేసి, నూతి వైపు తీసుకెళ్లింది ఆనంద్‌ని సీతమ్మ.

చకచకా స్నానంచేసి, బట్టలు మార్చుకు న్నాడు.

'రామయ్యా, ఒకసారి డా॥ శేఖర్‌ని కలుసు కుందామా? ఆయనతో వస్తానని చెప్పాను'.

'అలాగేనండయ్యగారూ – మీకు అభ్యంత రం లేకపోతే మా ఆవిడ అన్నం వండేస్తుందండి – డాక్టర్‌గారిని కూడా ఇక్కడే తినమందాం' అంటూనే సీతతో అన్నాడు 'భోజనాలకి ఏర్పాటు చెయ్యి'.

'అభ్యంతరానికేముంది? శాఖాహారమైతే చాలు...'

'మేం పుట్టుకతో ఏమయితేనేం? తాతగారి ధర్మమా అని ఇప్పుడు పూర్తి శాఖాహారులం...' ఆయన మమ్మల్ని శుద్ధ శాఖాహారులుగా మార్చేసారు. ఆయన అలవాట్లే మాకు వచ్చాయండి... ఆయనగాని, బామ్మగారు కానీ మా నాన్నను పాలేరుగా చూడలేదండి. ఇంట్లో పిల్లలుగానే చూసారు'.

'నాకు తెలియక అడుగుతాను బాబుగారూ... అమ్మగారూ – పిల్లలూ ఏం చేస్తుంటారండీ?'

'నేను డాక్టర్ని – అమ్మగారూ డాక్టరే. ఇద్దరు పిల్లలూ డాక్టరు చదువుతున్నారు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి'.

'తాతగారు వుండివుంటే ఎంతో సంతోషించేవారండి! మనుమడు డాక్టరు, మనుమడు భార్య డాక్టరు, మునిమనుమలు డాక్టర్లు... ఇల్లంతా డాక్టర్లే. ఈ పల్లెల్లో డాక్టర్లు లేరని ఎంత బాధపడేవారో...'

'రండిబాబుగారూ... శేఖర్‌గారు మీ కోసం ఎదురు చూస్తూంటారేమో!'

ఇంటి బయటకు వచ్చారు. ఆటో ఇంకా అక్కడే వుంది. 'రమణా ఇంకా నువ్వు వెళ్లలేదా?' అడిగిన తర్వాత జ్ఞాపకం వచ్చింది ఆనంద్‌కి. తను ఇంకా డబ్బు ఇవ్వలేదని. పర్సు తీసి రెండొందల నోట్లు తీసి రమణ చేతిలో పెట్టబోయాడు.

'అయ్యగారూ! మీరు మా తాతగారి ఇంటికి వచ్చారు. మా డాక్టరు గారితో వచ్చారు. నేను ఈ ఊరివాడిని... మీ దగ్గర డబ్బులు ఎలా పుచ్చుకుంటాను?' పుచ్చుకోవడానికి ఒప్పుకోలేదు.

'నువ్వు ఇలా పెట్టుకుంటే నీ ఆటోకి పెట్రోలుకి, రిపేర్లకూ డబ్బు ఎవరు ఇస్తారు? పుచ్చుకో' బలవంతం చేసాడు ఆనంద్. పుచ్చుకోక తప్పలేదు రమణకు.

తాతగారి ఆసుపత్రి చేరుకున్నారు. అప్పటికి పేషెంట్స్ అందరూ వెళ్లిపోయారు. కాంపౌండర్ పెట్టెలో డబ్బుతీసి లెక్కపెడుతున్నాడు. కొనవలసిన మందుల లిస్ట్ వ్రాస్తున్నాడు డా॥ శేఖర్.

'రండి ఆనంద్, ఇప్పుడే అనుకుంటున్నాను ఇంకా మీరు రాలేదేమిటా అని'.

'వారానికి ఎన్నిరోజులు వస్తారు మీరు ఇక్కడికి?'

'మూడు రోజులు తప్పకుండా వస్తాను. ఎప్పుడు వచ్చేది నా హాస్పటల్ పనిని బట్టి వుంటుంది. ఏ రోజు ఏ టైమ్‌కి వచ్చేది ముందుగా కబురు చేస్తాను. కాంపౌండర్ ఆరు రోజులూ వస్తాడు. కనీసం రెండు, మూడు గంటలు వుంటాడు'.

'ఎన్ని సంవత్సరాల నుంచి వస్తున్నారు?'

'నాకు బాగా జ్ఞాపకం – అవి నేను ఎమ్.డి., డి.ఎమ్. చేసి మా స్నేహితులు అందరూ వద్దంటున్నా పక్క పట్టణంలో ప్రాక్టీస్ పెట్టాను. అప్పటి నుంచి వైద్య సదుపాయాలు లేని చిన్న పట్టణంలో ప్రాక్టీస్ పెట్టి అక్కడి ప్రజలకు సహాయం చేద్దామన్న కోరిక పూర్తి చేసుకోవాలన్న ప్రయత్నంలో వున్నాను. నా భార్య ఆలోచనలూ నాతో ఏకీభవించడం నా అదృష్టం. ఒకరోజు మేం ఇద్దరం హాస్పటల్‌లో కూర్చుని పేషెంట్స్‌ని పరీక్ష చేస్తున్నాం. అప్పుడు వచ్చారు తాతగారు. ఒక ఏడెనిమిది సంవత్సరాల అబ్బా

యిని మరొక అతను భుజంమీద తీసుకు వచ్చాడు. విషపాము కాటు... ఆ పల్లెటూర్లో నాటువైద్యం చేసి, ఇక వాళ్ల వల్ల కాక తాతగారి దగ్గరకు పరుగెత్తారట. ఆయన తిన్నగా నా దగ్గరకు తీసుకువచ్చారు. నేను, నా భార్య ఇద్ద రం పరీక్ష చేసాం. ఆఖరిక్షణాలు... బ్రతకడం అసంభవం. అయినా చేయగలిగింది చేసాం. దేవుడు మాకు సహకరించలేదు. ఆ పిల్లవాడు ఇంకా కొన్ని క్షణాలకంటే బ్రతకడు. ఆయన మొహంలో ఆతృత, ఆందోళన చూసి అను కున్నాను. ఆయన మనుమడు అయి వుంటా డని. మెల్లగా అన్నాను ఆయనతో... కనీసం రెండు, మూడు గంటల ముందు వచ్చివుంటే. పిల్లవాడిని బ్రతికించడానికి అవకాశం వుండే దని. ఇంకా ఏమో అనేలోగానే ఆ పిల్లవాడి శ్వాస ఆగిపోయింది.

వెనకాతల వున్న ఆ పిల్లవాడి తల్లిదండ్రులు గొల్లుమన్నారు.

'చూడమ్మా, ఇప్పుడు ఏడ్చి ఏం ప్రయో జనం? నాటు వైద్యుడి దగ్గరకు వెళ్లడం కంటే తిన్నగా ఇక్కడికే వస్తే మీ పిల్లవాడు దక్కేవా డేమో?' తాతగారి మాటలు విన్న నాకు అప్పు డు అర్థమైంది ఆ పిల్లవాడు ఆయన మనుమడు కాదని.

నాతో అన్నారు ఆయన... 'డాక్టర్, మీరు ఇంత చదువుకున్నారు... మా పల్లె ప్రజలకు ఎందుకు సహాయం చేయకూడదు? మేం పుష్క లంగా డబ్బు ఇవ్వలేకపోవచ్చు. కానీ మేం కూడా మనుష్యులం అని నిరూపించుకోగలం. కనీసం వారానికి ఒకటి రెండు రోజులు మా పల్లెటూరికి వచ్చి, మా పల్లె పిల్లల్ని, మమ్మల్నీ చూడండి'.

ఆయన మాటలు ఎందుకో నా హృదయం లో హత్తుకుపోయాయి. ఆయన ఆ పల్లె ప్రజల కోసం అంత బ్రతిమలాడవలసిన అవసరం ఏమిటి? ప్రతిరోజూ ఎంతమంది పిల్లలు, పెద్ద లూ పాముకాట్లకు, వ్యాధులకూ గురిఅవుతారు, ప్రాణాలు కోల్పోతారు... అందులో కొత్త ఏముంది? ఆయన నిస్వార్థ మనస్తత్వం చేయ గలిగింది చేయమని నన్ను ప్రోత్సహించింది. ఆయనకు నేను, నా భార్య మాట ఇచ్చాం. వారానికి రెండు మూడుసార్లు వచ్చి, ఆ పల్లె ప్రజల ఆరోగ్యం చూస్తామని. అప్పటి నుంచీ ఆ మాట నిలబెట్టుకుంటూనే వున్నాం'.

'ఇక్కడ పేషెంట్స్ నుంచి వచ్చిన డబ్బు మీ కారు పెట్రోలుకి కూడా సరిపోదనుకుం టాను'.

'అసలు ఆ డబ్బు నేను తీసుకోను. నా కాంపౌండర్ అసలే తీసుకోడు. ఆ వచ్చే డబ్బు ఈ చిన్న ఆసుపత్రి ఖర్చులకు కూడా సరిపోదు. ఈ ఊళ్లో సహృదయులైన మోతుబరులు ఉన్నా రు. ప్రతి సంవత్సరం సంక్రాంతి రోజులలో ఎంతో కొంత ఇస్తూ వుంటారు. తన పొలాల విషయం - రామయ్యకు, నాకూ అప్పజెప్పారు తాతగారు. ఆ విషయాలు రామయ్య చూస్తూ వుంటాడు. అది కొంచెం వస్తుంది. నాకు ఉన్న పలుకుబడిమీద కొన్ని పెద్ద మెడికల్ కంపెనీల వారు ఈ ఆసుపత్రికి కొన్ని మందులు ఫ్రీగా ఇస్తారు. ఎవరైనా చిన్నపిల్లలకు మేజర్ సర్జరీ చెయ్యాలంటే పక్క పట్టణం తీసుకువెడతాం. వాళ్ల తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని బట్టి సహా యం చేస్తాం' ఇంకా ఏదో చెప్పబోయాడు శేఖర్.

'అయ్యగారూ - ఇప్పటికే ఆలస్యం అయిం ది. మీరు కూడా ఆనంద్ బాబుగారితో భోజనం చేద్దురుగాని... రండి' మధ్యలో కల్పించుకుని

అన్నాడు రామయ్య.

'నేను త్వరగా వెళ్లాలి రామయ్యా, సాయంత్రం అమ్మగారు సర్జరీ చెయ్యాలి'.

'ఆలస్యం ఏమీ ఉండదు... భోజనం చెయ్యడం, రమణ వెంటనే మిమ్మల్ని తీసుకువెడతాడు'.

శేఖర్‌కి రామయ్య ఇంట్లో భోజనం చేయక తప్పలేదు. వెంటనే బయలుదేరడానికి సిద్ధమయ్యాడు.

'అయ్యగారూ రేపొద్దున్న రావడం మర్చిపోకండి. అమ్మగార్ని కూడా తీసుకురండి... తాతగారి జ్ఞాపకదినం'.

'అదెలా మర్చిపోతాను రామయ్యా? తప్పకుండా వస్తాం' అంటూ ఆటోలో వెళ్లిపోయాడు శేఖర్.

మధ్యాహ్నం ఎండ కొంచెం ఎక్కువగానే వుంది. ఫ్యాన్‌క్రింద కూర్చున్నాడు ఆనంద్. తెలియకుండానే ఒక కునుకు... సుమారు గోధూళి వేళకు మెలకువ వచ్చింది.

'అయ్యగారూ... కాఫీ' కాఫీ తెచ్చి ఇచ్చింది సీతమ్మ.

'మీకు శ్రమ ఇస్తున్నానమ్మా' అన్న ఆనంద్ మాటలకు మా తాతగారి మనుమడికి ఈ మాత్రం చెయ్యలేమా?' ఆమె జవాబు.

కాఫీ తాగి, నూతి దగ్గర కాళ్లు, చేతులు, మొహం కడుక్కుని, బట్టలు మార్చుకున్నాడు. రామయ్య కూడా సిద్ధమయ్యాడు. ఊళ్లో ఏ మార్పులు వచ్చాయో చూద్దామని బయలు దేరాడు ఆనంద్ రామయ్యతో కలిసి. పక్కన తాతగారి తమ్ముడి ఇల్లు ఖాళీగా ఉంది. తాళం వేసి ఉంది. వెనకపక్క సాలెవీధిలోకి తిరిగాడు.

'ఇక్కడ సర్వేశ్వరరావు అనే ఒకతను ఉండేవాడు' అడిగాడు రామయ్యను.

'నేనేనండీ' అంటూ ఆనంద్ వయస్కుడు ముందుకు వచ్చాడు.

'నువ్వు నన్ను ఆనవాలు కట్టలేవు, నేను నిన్ను ఆనవాలు కట్టలేను... నేను ఆనంద్... మనుమడిని'.

'ఎంత మారిపోయారు? ఎంత కాలానికి మళ్లీ మిమ్మల్ని చూస్తున్నాను?'

గాలిపడగలు, రుంజలు రోజులు జ్ఞాపకం చేసుకున్నారు. అతను కూడా వీళ్లతో కలిసి, ఊళ్లోకి వచ్చాడు. తాతగారి హాస్పటల్‌కి కొంచెం దూరంలో ఉన్న తాతగారి లైబ్రరీలోకి వెళ్లారు. న్యూస్‌పేపర్లు, వార్తాపత్రికలు, మాసపత్రికలూ... ఇలా ఎన్నో పుస్తకాలు, పత్రికలూ ఉన్నాయి. 'ఇవి ఎక్కడి నుంచి వస్తాయి?' ప్రశ్నించాడు ఆనంద్.

'కొన్నింటికి మేం కడతామండి. కొన్ని ఎలా వస్తాయో మాకూ తెలీదు. తాతగారు ఎవరితో ఎప్పుడు మాట్లాడారో కానీ కొన్ని పత్రికలు, పేపర్లు వస్తాయి. వాటికి బిల్లులు మాత్రం రావు'.

నమ్మలేకపోయాడు ఆనంద్.

ప్రతి రోడ్డుమీదా 'పొగత్రాగడం నిషేధం' అని బొమ్మలున్నాయి. తాతగారు పొగత్రాగడానికి ఆమడదూరం. ప్రపంచం అంతటా పొగత్రాగరాదు - అది ఆరోగ్యానికి మంచిది కాదు అంటూంటే... మనం ఇలా వుంటే ఎలా? ఈ పల్లెల్లో యువకులను పట్టుకుని. వారిని ఒప్పించి, వారి సహాయంతో ఈ ఉద్యమం మొదలుపెట్టారండి. చాలావరకూ తగ్గిందండి. అంతెందుకు ఈ ఊళ్లో ఏ దుకాణంలోనూ సిగరెట్లు అమ్మరండీ. పొగాకు ఇంకా

కొంచెం వుందండి. ఎవరైనా సారాతాగి రోడ్డు మీద కన్పిస్తే వాడికి బడితపూజే'.

తాతగారి పేరుతో జతచేర్చని మంచి విషయం ఆ ఊళ్లో లేదేమో అన్పించింది ఆనంద్‌కి.

ఆనంద్ సెల్ మోగింది... 'చాలా ఎంజాయ్ చేస్తున్నాను. నువ్వు వచ్చివుంటే రెండు, మూడు రోజులు వుండేవాళ్లం... రేపు సాయంత్రం బయలుదేరివస్తున్నాను అనుకున్న ప్రకారమే'.

'అమ్మగారు... ఈ ఊరు ఎలా వుందని అడుగుతున్నారు' చెప్పాడు తనవైపు చూస్తున్న రామయ్యతో.

ఆ రోజు రాత్రంతా ఆలోచిస్తూ పడుకున్నాడు ఆనంద్. అతన్ని ఎంతో ఆకర్షించిన, ఆకట్టిన మనిషి డా॥ శేఖర్. అటువంటి నిస్వార్ధపరుడు, నిగర్వి చాలా అరుదు. ఒక విధంగా చెప్పాలంటే తనతో సమానమైన అర్హతలు ఇంచుమించుగా. మరొకరికి సహాయం చేద్దామన్న అతని కోరిక అంతులేనిది - ఎంత చేసినా ఇంకా చెయ్యలేదని బాధపడే మనస్తత్వంగల అతనే నిజమైన మనుమడు. కారణం తాతగారి ఆశయాలకు అంత ప్రాముఖ్యం ఇస్తున్నాడు డా॥ శేఖర్.

తాతగారి మీదకు మళ్లాయి ఆలోచనలు - ఆయన నిరాడంబర జీవితం, నిస్వార్ధ సేవ - ఆ పల్లె ప్రజలకు అతి సన్నిహితుణ్ణి చేసాయి.

ప్రొద్దున లేచి కాలకృత్యాలు తీర్చుకుని, రామయ్యతో మడుగువైపు నడక ప్రారంభించాడు ఆనంద్. చాలామందికి తాతగారి బంధువు అని పరిచయం చేసాడు. నిజం చుట్టరికం చెప్పొద్దని తను చెప్పడం వల్ల. మడుగు ఒడ్డున రెండు సమాధులున్నాయి. అప్పటికే చాలా మంది అక్కడికి వచ్చివున్నారు. ప్రతీవారూ రావడం, పువ్వులు పెట్టడం... నమస్కారం పెట్టుకుని వెళ్లిపోవడం... కొంతమంది దీపాలు వెలిగించారు. ఉపన్యాసాలు లేవు - నిశ్శబ్దం. ఆ సమాధుల మీద పేర్లు లేవు... తాతగారు - బామ్మగారు... అంతే.

డా॥ శేఖర్, అతని భార్య డా॥ రేఖ వచ్చారు. ఆనంద్‌ని పరిచయం చేసాడు డా॥ శేఖర్.


'మీ ఇద్దర్నీ అభినందించాలి. మీరు చేస్తున్న సేవలో వందోవంతు ప్రతి డాక్టరూ చేస్తే... దేశంలో ప్రజల ఆరోగ్య పరిస్థితులు చెప్పలేనంత బాగుపడేవి' అభినందించాడు ఆనంద్.

'లేదు... తాతగారి లాంటి వాళ్లు నూటికీ కోటికీ ఒకరుంటారు. వాళ్ల నీడలు పడ్డాయి ఈ పల్లెటూరిమీద. దాని ప్రభావం ఇది' రేఖ జవాబు. ప్రజలు వస్తూనే వున్నారు. యువకులు, ఎలిమెంటరీ స్కూల్ పిల్లలు, వయసు మళ్లిన వృద్ధులు... ఒకరేమిటి? ఆ పల్లె పల్లె అంతా వచ్చి వెళ్లింది. కులమత భేదాలు లేవు, వర్ణ విభేదాలు లేవు, కులగోత్రాలు లేవు, రాజకీయాలు అసలే లేవు.

రామయ్యా - మనం కొబ్బరితోట వైపు వెడదామా? డా॥ శేఖర్... మీకు అభ్యంతరం లేకపోతే మీరు, డా॥ రేఖ కూడా మాతో రండి...'.

'ఓకే... అలాగే' కొబ్బరితోట వైపు నడిచారు.

'అయ్యగారూ! తాతగారు నాకూ, డాక్టరు గారికీ కొన్ని బాధ్యతలు అప్పగించారు. మేం చెయ్యగలిగింది చేస్తున్నాం. మీరు కొంచెం సమయం ఇస్తే జమాఖర్చులు చూపిస్తాను. ఉన్న డబ్బు బ్యాంకులోనే వుంటుంది. నేను, డాక్టరుగారూ ఒకరితో ఒకరు సంప్రదించి




చేస్తాం ఏ పని చేసినా' అంటున్న రామయ్యను వారించి,

'నేను ఆ విషయం గురించి తెలుసుకోవడానికి కూడా అర్హుణ్ణి కాదు. నేను తాతగారికి మనుమడిని - బంధుత్వానికి మాత్రమే. డాక్టరు గారూ, నువ్వూ ఆయనకు నిజంగా వారసులు. మీరు ఇద్దరూ చేస్తున్న ఈ సేవలను ఎలా అభినందించాలో తెలియడంలేదు. దయచేసి ఆ విషయాలు నాతో మాట్లాడకండి'.

రామయ్య ఏం మాట్లాడలేకపోయాడు. మళ్లీ ఆనంద్ అన్నాడు 'నేను ఇక్కడకు వచ్చింది చిన్నతనంలో ఇక్కడ గడిపిన మధురక్షణాలు జ్ఞాపకం చేసుకుందామని. నేను చూసినవి నమ్మలేని, నమ్మశక్యంకాని నిజాలు. ఇక్కడ విన్నవి, చూసినవీ ఎప్పటికీ మర్చిపోలేను'.

'అవునూ... ప్రతీవారూ - తాతగారు, తాతగారు... అంటారు కానీ ఆయన పేరు విన్పించదే? ఎవరూ ఆయన పేరు చెప్పరే? ఆయన ఫొటో కూడా ఎక్కడా కన్పించదే?' ఉండబట్టలేక అడిగేసాడు ఆనంద్.

'అదేనండీ ఆయనలో వున్న గొప్పదనం. ఎక్కడా ఆయన పేరు వ్రాయకూడదు. చివరకు ఆయన సమాధిమీద కూడా. ఎక్కడా ఆయన ఫొటో పెట్టకూడదు. ఆయన కోరికకే కట్టుబడి వున్నాం మేమందరం' రామయ్య జవాబు.

కొబ్బరితోటలో కాసేపు కూర్చున్నారు... కొబ్బరిబొండాలు, ముంజిలు... మళ్లీ నలభై ఏభై సంవత్సరాల క్రితం జ్ఞాపకాలు...

స్టేషన్ చేరుకున్నారు అందరూ. డా॥ శేఖర్, డా॥ రేఖా 'మిమ్మల్ని అందర్నీ కలుసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. తప్పకుండా మళ్లీ అతి త్వరలోనే కలుసుకుందాం' ఆనంద్ అంటూండగానే రైలు కదిలింది. తను ఆ ఊరికి వస్తున్నప్పుడు ఆలోచించింది - తన చిన్నతనాన్ని గురించి, తను ఆ పల్లెలో గడిపిన మధురక్షణాలను గురించీ... ఇప్పుడు పరి

స్థితి... తను చూసింది – నగ్నసత్యం – అంతకంటే ముఖ్యంగా ఇప్పుడు తాను ఏంచేయాలి?

ఎంత ప్రయత్నించినా తలపులను తాతగారి మీద నుంచి, డా॥ శేఖర్ మీదనించీ మళ్లించలేకపోతున్నాడు ఆనంద్. తన తాతగారు తనకు ఉన్న కొంచెం ఆస్థితో కేవలం సంపూర్ణ విశ్వాసంతో తన ఆశయాల మీద దృఢ నిశ్చయంతో ఒక పల్లెటూరి రూపురేఖలే మార్చేసారు. తాతగారు ఎవరు? కుర్రకారుకి, పిల్లలకూ ఆయనపేరు తెలీదు. ఆయన ఎలా వుంటారో తెలియదు. అందరికీ ఆయన తాతగారు. ఆయన సంపాదించిన ఆప్యాయత, ఆదరణ, గౌరవం ఎంతమందికి లభిస్తుంది? ఎంత డబ్బు పెడితే మాత్రం కొనగలరా? తను ఇంత వరకూ ఆర్జించిన డబ్బు కొల్లలుకొల్లలుగా ఉంది. ఎవరైనా తనకు గౌరవం ఇస్తే అది తన ఐశ్వర్యం వలనా, లేక తను చేసిన ఆపరేషన్‌ల వల్ల... కానీ తాతగారి విషయంలో... అది ఆ పల్లెలో ప్రతి మనిషి హృదయంలోంచి సహజంగా వచ్చింది. ఆయన మనుమడిని అన్పించుకోవడానికి ఏదో చెయ్యాలి. దానికి డా॥ శేఖర్ సారధి కావాలి... ఆనంద్ మెదడులో ఒక మెరుపు.

తను చూసింది చెప్పి, తన ఆలోచనలను


## STATEMENT OF OWNERSHIP AND OTHER PARTICULARS OF KATHAKELI

*Form IV (See Rule 8)*

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Vijayawada |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | M. Rama Rao |
| | Whether Citizen of India? | : | Yes |
| | Address | : | 29-25-43A, Vemurivari Street Suryaraopet, Vijayawada - 2 |
| 4. | Publisher's Name | : | M. Rama Rao |
| | Whether Citizen of India? | : | Yes |
| | Address | : | 29-25-43A, Vemurivari Street Suryaraopet, Vijayawada - 2 |
| 5. | Editor's Name | : | M. Naga Kumari |
| | Whether Citizen of India? | : | Yes |
| | Address | : | 29-25-43A, Vemurivari Street Suryaraopet, Vijayawada - 2 |
| 6. | Name and Address of individuals who own the News Paper and partners or share holders holding more than one percent of the total capital | : | M. Rama Rao 29-25-43A, Vemurivari Street Suryaraopet, Vijayawada - 2 |

I, M. Rama Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

(Sd) M. RAMA RAO
Signature of the Publisher

Date: 1st March, 2008

భార్య స్నేహతో చర్చించాడు. 'నేను మీ ఆలో చనతో పూర్తిగా ఏకీభవిస్తాను. మన పరిస్థితులు ఆ పల్లెటూర్లో స్థిరపడదానికి సహకరించవు. ఇన్ని సంవత్సరాలు విదేశాలలో వుండి, ఇప్పు డు ఏ పల్లెటూర్లోనో వుండడం కష్టం. ఒకటి మటుకు నిజం... మనం ఆయన మొదలు పెట్టిన మంచి పనులకు దోహదం ఇవ్వొచ్చు. మీరు చెప్పినట్లుగా ప్రతి సంవత్సరం ఇండియా కు వచ్చినపుడు కొద్దిరోజులు ఆ పల్లెలో వాళ్లతోపాటు వుందాం' స్నేహ జవాబు తను ఆశించినట్లుగానే ఉంది. ఆమె తనతో ఏకీభ విస్తుందని తనకి తెలుసు.

అమెరికా చేరగానే శేఖర్‌తో ఫోన్లో మాట్లా డాడు. అది మొదలు వాళ్లిద్దరి స్నేహం గాఢంగా మారింది. తాతగారి పేరుమీద తాను ఒక ట్రస్టు ఏర్పాటు చేస్తానని, దానికి డా॥ శేఖర్ సహాయం కావాలనీ అడిగాడు ఆనంద్. తను సిద్ధమేనన్నాడు శేఖర్.

మూడు నెలలు గడిచాయి. నాలుగు వేళ్లలో పది పదిహేను మంది ఆఫీసర్లు, డా॥ శేఖర్, డా॥ ఆనంద్ తాతగారిపాలెం వచ్చారు. వచ్చిన వాళ్లలో డాక్టర్లు, ఇంజనీర్లు, గవర్నమెంట్ ఆఫీసర్లు ఉన్నారు. కలెక్టరుతో సహా. ఊరి కరణం, సర్పంచ్, స్కూలు హెడ్‌మాస్టర్, ఊరి లో మోతుబరులు అందర్నీ పిలిపించారు. అందరూ కచేరీ చావడిలో కలుసుకున్నారు. డాక్టర్ శేఖర్ అక్కడ గుమికూడిన వారందరికీ ఒక సందేశం అందించాడు. అది అక్కడ చేరిన వారినందరినీ ఆనందంలో ముంచేసింది. డా॥ ఆనంద్... తాతగారి మనుమడు... అమె రికాలో ఒక పేరుమోసిన డాక్టర్... కొన్ని కోట్ల రూపాయల వ్యయంతో తాతగారి పేరుమీద ఒక ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నాడు. అందులో ప్రభుత్వం కూడా భాగస్వామి అవుతోంది.

కరణంగారు, సర్పంచ్ ప్రభుత్వ స్థలాలను గురించి వెదకడం మొదలుపెట్టారు. ఏఏ స్థలా ల్లో ఏఏ సంస్థలను ఏర్పాటు చేయాలన్న విష యాలను చర్చించారు.

ట్రస్ట్ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాంట్లో ముఖ్యులు – డా॥ ఆనంద్, డా॥ శేఖర్, డా॥ రేఖ, రామయ్య మరికొంతమంది ఆ పల్లెటూరి పెద్దలు. అందరూ డా॥ ఆనంద్ ఛైర్మన్‌గా వుండాలని వత్తిడి చేసారు.

'నేను ఈ దేశంలో ఉండడంలేదు. ఎక్కడో వుంటూ ఆ పదవీ బాధ్యతలు నిర్వహించడంలో నేను న్యాయం చేయలేను. తాతగారికి నేను మనుమడిని. కాని నిజమైన వారసుడు డా॥ శేఖర్' అంటూ ఆనంద్ చెప్పిన కారణాలు సమంజసంగా అన్పించడంతో అందరూ ఆయ నతో ఏకీభవించక తప్పలేదు. కరతాళ ధ్వనులతో ఆయన ప్రతిపాదనను ఆమోదించి, డా॥ శేఖర్‌ని ఛైర్మన్‌గా ఎన్నికచేసారు.

* * *

ఆ రోజు ట్రస్ట్ సంస్థలకు ప్రారంభోత్సవం. ముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, ఎం.పి., ఎం.ఎల్.ఏ. లు అందరూ వచ్చారు. వేదిక మీద మంత్రులు, డా॥ ఆనంద్, డా॥ శేఖర్, డా॥ రేఖ, రామయ్య, ట్రస్ట్ మెంబర్లు కూర్చున్నారు.

రాజకీయాలు లేవు... గంటల తరబడి ఉప న్యాసాలు లేవు... మూడే మూడు ఉపన్యా సాలు. చివరగా డా॥ ఆనంద్ ఉపన్యాసం... ఈ వేదిక మీద నుంచి ఒక హామీ ఇస్తున్నాను... తాతగారి మనుమడిగా, ఎప్పుడు ఏ విధమైన సహాయం కావాలన్నా, క్లిష్టమైన సర్జరీ చేయ డానికైనా మీకూ నాకూ ఉన్న దూరం... ఒక్క ఫోన్ కాల్ మాత్రమే. మర్చిపోకండి. ●